ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



లింక్‌రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని ప్రతికాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. హయత్‌నగర్ పరిధిలోని శివంహిల్స్ నుంచి ప్రగతినగర్‌కాలనీ వరకు ప్రధాన లింక్‌రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే వివిధ కాలనీలకు లింక్ రోడ్డు పనులు చేపట్టలేదన్నారు. అధికారులపై ఒత్తిడి పెంచి నిధులు మంజూరు చేయించడం జరిగిందని వివరించారు. ఇటీవల జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌ను రోడ్డు పరిశీలనకు తీసుకొచ్చి ఇక్కడి పరిస్థితి వివరించగా స్పందించి రీటెండరింగ్ చేయించడంతో రూ.21.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, యాదగిరియాదవ్, ఆనంద్‌యాదవ్, నరేష్‌రెడ్డి, రాధాకృష్ణ, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

జీఐఎస్ మ్యాపింగ్ సర్వే ప్రారంభం



సర్వేను ప్రారంభిస్తున్న డీసీ యాదయ్య

ఎల్‌బీనగర్: గ్రేటర్ పరిధిలోని రెసిడెన్షియల్, కమర్షియల్ ఆస్తులపై జీఐఎస్ మ్యాపింగ్ సర్వేలో భాగంగా ఇంటింటి సర్వే మంగళవారం ఎల్‌బీనగర్ సర్కిల్–3 పరిధిలోని హయత్‌నగర్ డివిజన్‌లో డీసీ యాదయ్య, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టిన ఈ సర్వేతో సేకరించిన వివరాలు పారదర్శకంగా ఉంటాయని డీసీ యాదయ్య తెలిపారు.అభివృద్ధి కోసమే ఈ సర్వే చేయడం జరుగుతోందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఆస్తులు, యుటిలిటీల వివరాలు మ్యాపింగ్ చేయడంతో భౌగోళికంగా గుర్తించడం సులభమవుతుందని పేర్కొన్నారు. ఇంటింటికి వచ్చే సిబ్బందికి తగిన సమాచారం ఇవ్వాలని కోరారు. మొదటి రోజున 8 ఆస్తుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి మహేందర్, ఏఎంసీ దినేష్‌సింగ్, టాక్స్ ఇన్‌స్పెక్టర్ శివరాజు, సర్వేయర్స్ బాలసుబ్రహ్మణ్యం, అజయ్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో మైనర్ల వీరంగం

ఇల్లు, కారుపై రాళ్లదాడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాఫర్ మెరాజ్ హుస్సేన్

చంచల్‌గూడ: మద్యంతోమత్తులో పలువురు మైనర్లు ఓ యువకుడి ఇంటిపై దాడి చేసి వీరంగం సృష్టించిన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మాదన్నపేట కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న మహ్మదియా మసీదు వద్ద సోమవారం అర్ధరాత్రి కొందరు మైనర్‌లు మద్యం, సిగరెట్ తాగుతున్నారు. ఇది గమనించిన రయ్యన్‌ఖాన్ (19) వారిని వారించగా కోపోద్రిక్తులైన మైనర్‌లు దాడి చేసేందుకు యత్నించగా భయంతో బాధితుడు ఇంట్లో కెళ్లి తలుపులు వేసుకున్నాడు. అంతటితో ఆగకుండా మైనర్లు ఇల్లు, కారుపై రాళ్లు రువ్వి భయాందోళనకు గురి చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. నిందితులను గుర్తించిన పోలీసులు స్థానిక యువకులను అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలిసిన యాఖుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ మేరాజ్ హుస్సేన్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించాడు.



రోడ్ల పక్కన ఇష్టానుసారంగా చెత్త, వ్యర్థాలను పారబోస్తుండటంతో దారంతా దుర్గంధంగా మారుతుందని కాలనీలవాసులు వాపోతున్నారు. చైతన్యపురి డివిజన్ న్యూదిల్‌సుఖ్‌నగర్ కాలనీ రోడ్డులో ఓ ఖాళీ స్థలం పక్కన చాలాకాలంగా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. శానిటేషన్ సిబ్బంది సైతం రహదారులు ఊడ్చి అక్కడే వేయడం, కొందరు కాలనీవాసులు ఇళ్లలోని చెత్తను ఇక్కడే వేస్తుండటంతో డంపింగ్ యార్డుల తలపిస్తోంది. అటుగా రాకపోకలు సాగించే క్రమంలో ఘాటైన దుర్వాసన వస్తోందని సంబంధిత అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–చైతన్యపురి

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ ఎంవీఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి కమ్మగూడ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం మేయర్ చిగురింత పారిజాతారెడ్డి ప్రారంభించారు. పనులు త్వరగా పూర్తి చేసి రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, గూడెపు ఇంద్రసేనా, డీఈఈ జ్యోతిరెడ్డి, నాయకులు ఆనంద్‌రెడ్డి, అశోక్, శివారెడ్డి, కాలనీవాసులు తదితరులున్నారు.

ఆడపిల్లల అక్రమ రవాణా అరికట్టాలి

తుక్కుగూడ: ఆడపిల్లల అక్రమ రవాణాను ప్రతి ఒక్కరూ అరికట్టాలని పహాడీషరీఫ్ ఎస్‌ఐ దయాకర్, ప్రజ్వల జూనియర్ డైరెక్టర్ అహ్మద్ అలీ సూచించారు. మంగళవారం ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో పహాడీషరీఫ్ దర్గా నుంచి తుక్కుగూడ వరకు ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల చేత మానవ అక్రమ రవాణా నిర్మూలన అనే అంశంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది సమాజంలో అతిపెద్ద నేరంగా మారిందన్నారు. ఈ ప్రభావం ఎక్కువగా నిరుపేదలపై పడుతుందన్నారు. ప్రజ్వల సంస్థ ఇప్పటి వరకు 28 వేల మంది అమ్మాయిలు, మహిళలను కాపాడి పునరావాసం కల్పించిందన్నారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రజ్వల అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా ప్రిన్సిపాళ్లు సుబ్బరావు, సింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది చంద్ర, బలరాం, సిరాజ్, మల్లేష్, నరేష్, అనిత, సూర్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

- జైపురికాలనీలో నిరుపయోగంగా స్థలాలు
- వాకింగ్ ట్రాక్, ఆట సామగ్రి సమకూర్చాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



అభివృద్ధికి నోచుకోని జైపురికాలనీ పార్కు స్థలం

ఖాళీ స్థలాలు.. పార్కుగా మారిస్తే మేలు!

నాగోలు: పేదలు నివాసముండే కాలనీలు, బస్తీల వైపు అధికారులు, ప్రజా ప్రతినిధులు చిన్న చూపు చూస్తున్నారని బస్తీల వాసులు వాపోతున్నారు. ఆయా కాలనీల్లో ఖాళీ స్థలాలు ఉన్నప్పటికీ అవి నిరుపయోగంగా మారుతున్నాయి. అభివృద్ధి చెందిన కాలనీలలో పార్కులను అభివృద్ధి చేస్తున్న అధికారులు పేదలు ఉండే ప్రాంతాల్లో పార్కుల ఏర్పాటు కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హయత్‌నగర్ సర్కిల్ పరిధి నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ, ఫ్రెండ్స్‌కాలనీ, నువ్వులబండ, హనుమాన్ నగర్, వడ్డెర బస్తీలో పరిసర ప్రాంతాలలో పార్కులు అందుబాటులో లేక అక్కడి చిన్నారులు ఆడుకునేందుకు, పెద్దలు వాకింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. జైపురికాలనీ ఏర్పడినప్పుడు పార్కుల కోసం రెండు చోట్ల స్థలాలు వదిలేయడం జరిగిందని అయితే అవి నేటికి ఖాళీ స్థలాలుగానే దర్శనమిస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ప్రజారోగ్యం కోసం ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, చిన్న పిల్లల కోసం ఆట వస్తువులు ఏర్పాటు చేసి పార్కుగా మార్చి అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో పార్కు గేటు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

జైపురికాలనీ పరిసర ప్రాంతాల్లో దాదాపు పదివేల మంది జనాభా ఉన్నప్పటికీ జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు అక్కడ పార్కును అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేయడం లేదంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి జైపురికాలనీలో ఉన్న ఖాళీ స్థలంలో పార్కుగా అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పిస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుందని కాలనీ వాసులు కోరుతున్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీలో ఉన్న పార్కు స్థలాల్లో రాత్రి సమయాల్లో యువకులు పెద్ద సంఖ్యలో చేరి గంజాయి, మద్యం తాగుతూ గొడవలకు దిగుతున్నారు. పార్కులకు ప్రహరీ, గేటు సరిగ్గా లేకపోవడంతో రాత్రి సమయాల్లో అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు.

అధికారులు స్పందించాలి..



నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ పరిసర ప్రాంతాలలో దాదాపు పదివేల మంది జనాభా ఉంది. అధికారులు స్పందించి కాలనీలోని ఖాళీ స్థలంలో పార్కుగా అభివృద్ధి చేయాలి. వాకింగ్ ట్రాక్, చిన్న పిల్లల కోసం ఆట సామగ్రి ఏర్పాటు చేసి కాలనీ వాసులకు అందుబాటులో తీసుకురావాలి. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేస్తాం.

–శ్యామల యాదగిరి, జైపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు..
టమాట రూ. 30, వంకాయ రూ. 35, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 38, బీర రూ. 35, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్ రూ. 65, క్యారెట్ రూ. 35, దొండ రూ. 28–40, చిక్కుడు రూ. 65, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 28, క్యాప్సికం రూ. 45, ఆలు రూ. 38, దోస రూ. 15, సొర రూ. 11, పొట్ల రూ. 13, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 40. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆధ్యాత్మిక భావాలు సన్మార్గంలో నడిపిస్తాయి

కాచిగూడ: ఆధ్యాత్మిక భావాలు మనిషిని సన్మార్గంలో నడిపిస్తాయని ఉడిపి జగద్గురు శ్రీమద్వాచార్య మూల మహా సంస్థానం పలిమారు మఠానికి చెందిన విద్యాధీశ తీర్థ శ్రీపాదుల స్వామిజీ అన్నారు. మంగళవారం లింగంపల్లిలోని రాఘవేంద్ర మి బృందావన సమితిలో భక్తులకు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. ధర్మ పరిరక్షణ కోసం ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. భక్తి జ్ఞానమే మోక్షం ప్రసాదిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర బృందావన సమితి ప్రతినిధులు బీపీ రాఘవేందర్‌రావు, కృష్ణమూర్తి, అనంతమూర్తి, వెంకటేష్, చంద్రశేఖర్, మేనేజర్ కె.నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

కాచిగూడ: అసెంబ్లీ సమావేశాల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థి సంఘం నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలన్నారు. నిరుద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో నామమాత్రంగా మాట్లాడి సమావేశాలను ముగించొద్దని కోరారు. జాబ్ కేలండర్‌ను పూర్తిస్థాయిలో ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు కట్ట హరీష్, ప్రభాకర్, గోపాల్, లోకేష్, స్వామి, ఉదయ్, శ్రీకాంత్, రాంబాబు, మల్లేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాచ్‌మన్‌పై దాడి

బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

కాచిగూడ: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న వాచ్‌మన్‌పై మద్యం మత్తులో ముగ్గురు యువకులు అకారణంగా దాడిచేసి గాయపరిచారు. ఈ సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన చంద్రయ్య కుమారుడు ఆంజనేయులు (45) లలిత అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో ఆంజనేయులు పాల కోసం బర్కత్‌పుర ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో వెళ్తుంగా అక్కడే మాటు వేసిన ముగ్గురు గుర్తు తెలియని యువకులు వాచ్‌మన్‌పై దాడిచేసి గాయపరిచారు. వాచ్‌మెన్ ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నార్త్ ఎక్స్ టెన్షన్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం కార్పొరేటర్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ నూతన అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్, ఉపాధ్యక్షులు పర్వత్‌కుమార్ యాదవ్, కోశాధికారి కొండల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, తులసినాయక్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్

చైతన్యపురి: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్టీసీ హైదరాబాద్–2 డిపోలో జరిగిన ప్రమాద రహిత వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత డ్రైవర్లదేనని డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదన్నారు. ఉత్తమ డ్రైవర్లు రాము, లక్ష్మణ్, ఎండీ. రషీద్, మెకానిక్‌లు ఆనంద్, శ్రీనివాస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కృష్ణమూర్తి, ఏఎంటి ఉషశ్రీ, ఎంఎఫ్ సతీష్, డిప్యూటీ సూపరింటెండెంట్ రమాదేవి, ఉమాపతి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ డ్రైవర్లను సత్కరిస్తున్న అశోక్‌కుమార్

అసెంబ్లీ సాక్షిగా అసత్య ప్రచారాలు

ఎమ్మెల్యే సబితారెడ్డిపై కేఎల్‌ఆర్ విమర్శలు

కందుకూరు: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి నిజానిజాలు తెలుసుకోకుండా అసెంబ్లీ సాక్షిగా అసత్య ప్రచారాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ విమర్శించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కందుకూరుకు వచ్చిన సందర్భంగా పోలీసులు అక్కడ జరుగుతున్న అంగడిని బంద్ చేయించి, బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టులు చేశారని అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం రాత్రి సబితారెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో మంగళవారం సాయంత్రం కేఎల్‌ఆర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో కూరగాయలు, పండ్లు, పూలు విక్రయించే చిరు వ్యాపారులతో నేరుగా మాట్లాడారు. సీఎం పర్యటన సందర్భంగా మిమ్మల్ని ఎవరైనా ఇబ్బంది పెట్టారని అడగగా అలాంటిది ఏమీ లేదని వారు చెప్పారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ మాట్లాడుతూ.. అంగడి యథావిధిగా కొనసాగిందన్నారు. ఎలాంటి అరెస్టులు చేయలేదన్నారు. అనవసరంగా ఆమె విషయం తెలుసుకోకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కృష్ణనాయక్, కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, నాయకులు సత్యనారాయణ, శ్రీధర్, వీరారెడ్డి, రాకేష్‌గౌడ్, రాంరెడ్డి, జగన్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్, కృష్ణ, శ్రీశైలం, జగన్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలలో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. కాలనీలలో చెత్త డంపింగ్‌ల వద్ద తిష్ట వేస్తూ దారినపోయే వాహనదారులు, పాదచారులపై మూకుమ్మడిగా దాడులకు తెగబడుతున్నాయి. కుక్కల సంచారంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు జీహెచ్‌ఎంసీ సిబ్బంది వాటిని పట్టుకోవడానికి వచ్చినా అవి దొరకకపోవడంతో చేసేదేమీలేక వెళ్లిపోతున్నారు. దీంతో కుక్కల సంతతి పెరిగి ఇళ్లలోంచి బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉంటుందని ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు. –వనస్థలిపురం

నేటి నుంచి నీటి సరఫరాపై స్పెషల్ డ్రైవ్

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాపై నేటి(బుధవారం) నుంచి వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు మలక్‌పేట డివిజన్ జలమండలి అధికారి ఎస్.అభిలాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ పరీవాహక ప్రాంతాలలో కలుషిత నీరు సరఫరా కాకుండా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామన్నారు.

నూతన కల్యాణ మండపం ప్రారంభం



శ్రీపాదుల స్వామి వారి ఆశీర్వాదం తీసుకుంటున్న కార్పొరేటర్

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి సచివాలయనగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని మంగళవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదెంద్ర తీర్థ శ్రీపాదుల స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజల అనంతరం ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, బీజేపీ నాయకులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ గురువు లక్ష్మీనారాయణ, యాదగిరి రావు, దామోదర్‌రెడ్డి, లీలానాథ్, జైపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సంగమేశ్వర్, పవన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

దూరంగా వెళ్లి ఆత్మహత్య చేసుకుంటా..

- సూసైడ్ నోట్ రాసి యువకుడి అదృశ్యం

సైదాబాద్: సూసైడ్ నోట్ రాసి పెట్టి ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సైదాబాద్ లైఫ్‌స్టైల్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న దివేష్ అగర్వాల్ (29) సోమవారం ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా సూసైడ్ నోట్ రాసి పెట్టి వెళ్లిపోయాడు. 'తాను చాలా సమస్యలతో నిరాశ చెందానని, ఆర్థికంగానూ ఇబ్బందులు ఉన్నాయి, తన అంత్యక్రియలకు ఖర్చులు కూడా కుటుంబ సభ్యులకు రానివ్వను హైదరాబాద్ నుంచి దూరంగా వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని' సూసైడ్ నోట్‌లో రాసి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నకిలీ పురుగు మందులతో జాగ్రత్త

సాక్షి,సిటీబ్యూరో: నకిలీ ఉత్పత్తుల తయారీ ముఠాల కార్యకలాపాలపై నిఘా ఉంచి, పోలీసులు జరిపిన దాడులలో పలు కంపెనీల నకిలీ ఉత్పత్తులు బయట పడ్డాయి. ఎల్బీనగర్ పరిధిలో జరిపిన దాడిలో 8 బహుళజాతి సంస్థలు, ప్రముఖ భారతీయ కంపెనీలైన ధనుక, సింజెంటా, ఎఫ్ఎంసి, కోర్టవా, ర్యాలీస్, ఇండోఫిల్, బేయర్ సంస్థల పేరిట నకిలీ ఉత్పత్తులు దొరికాయని, ఇవి పంటల నాణ్యతను దెబ్బతీయటమే కాక రైతుల జీవనోపాధికి ముప్పు తెస్తాయని వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని ఇండిపెండెంట్ కన్సల్టెంట్ ప్రదీప్ శర్మ సూచించారు.

నకిలీ ఫెవిక్విక్ విక్రయదారుల రిమాండ్

నాగోలు: నకిలీ ఫెవిక్విక్ ఉత్పత్తులను విక్రయిస్తున్న ఇద్దరిని ఎల్‌బీనగర్, ఎస్‌వోటీ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం..ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీలో విజయకృష్ణ, మనిష్ వేర్వేరుగా కిరణాదుకాణాలు నిర్వహిస్తున్నారు. నకిలీ ఫెవిక్విక్‌లను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు అందుకున్న పోలీసులు కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ఆయా దుకాణాల నుంచి 4,200 నకిలీ ఫెవిక్విక్‌లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

భార్యపై కోపంతో ఇంటి ద్వారంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు

చంచల్‌గూడ: భార్య పిల్లలు ఇంట్లో ఉండగా ప్రధాన ద్వారంపై ఓ ప్రబుద్ధుడు పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. భర్తతో గొడవల కారణంగా యాఖుత్‌పురా బాగేజారాకు చెందిన ఓ వివాహిత (30) తన నలుగురు పిల్లలతో కలిసి పదేళ్లుగా పుట్టింట్లో ఉంటుంది. ఆమె భర్త ముజీబ్‌ఖాన్ గత శుక్రవారం ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులపై దాడిచేసి వెళ్లాడు. శనివారం ఉదయం మళ్లీ వచ్చిన ముజీబ్ ఖాన్ ఇంటి తలుపులపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తీసుకున్న డబ్బులు అడిగినందుకు కత్తితో దాడి: కేసు నమోదు

హస్తినాపురం: తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో కత్తితో దాడిచేసిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హస్తినాపురం తూర్పు కాలనీకి చెందిన ముసలారెడ్డి, సాహెబ్‌నగర్ గౌతమినగర్ కాలనీలో ఉంటున్న వెంకట్‌రెడ్డికి రూ.66 వేలు అప్పుగా ఇచ్చాడు. వెంకట్‌రెడ్డి కొబ్బరి బోండాల వ్యాపారం చేస్తున్నాడు. తీసుకున్న డబ్బులను ఇవ్వాలని మంగళవారం హస్తినాపురంలోని కొబ్బరి బోండాల దుకాణానికి వెళ్లి వెంకట్‌రెడ్డిని అడిగాడు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి కోపోద్రిక్తుడైన వెంకట్‌రెడ్డి కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో ముసలారెడ్డిపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి



వేణుశ్రీ (ఫైల్)

చైతన్యపురి: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న శ్రీచైతన్య విద్యార్థిని వేణుశ్రీ (16) మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. ఈ నెల 20న వేణుశ్రీ ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించగా కళాశాల యాజమాన్యం చికిత్స నిమిత్తం ఓమ్ని ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించటంతో మలక్‌పేట యశోద ఆసుపత్రికి తరలించారు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా అంత్యక్రియల కోసం స్వగ్రామం అచ్చంపేటకు తీసుకెళ్లారు.